క్లుప్తంగా

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ నేడు

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ ఈనెల 4వ తేదీన తలపెట్టనున్న వెన్నుపోటు దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించనున్నట్లు మండల అధ్యక్షులు తాడిబోయిన శివ గోపయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు రైలుపేటలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ ఉంటుందని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

రైల్వే గేటు మూసివేత



ఫిరంగిపురం: మండల కేంద్రం నుంచి సత్తెనపల్లి వెళ్లే దారిలోని అల్లంవారిపాలెం వద్దగల రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం శనివారం రైల్వేశాఖ అధికారులు మూసివేశారు. గేటు సమీపంలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. పట్టాలు, వాటి చుట్టూ ఉన్న కంకర తొలగించి నూతనంగా ఏర్పాటు వంటి పనులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు వసంతనగర్ మీదుగా రైల్వే అండర్‌పాసు కిందుగా ఫిరంగిపురంలోకి వస్తున్నారు. మరో మూడు రోజులపాటు పనులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

మంగళగిరి: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించమని.. వారికి కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ అన్నారు. ఆదివారం రూరల్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు నేరప్రవృత్తి విడనాడి సత్‌ప్రవర్తనతో మెలగాలన్నారు. భూ దందాలు, సెటిల్మెంట్‌లు, గొడవలక దిగితే ఉపేక్షించేది లేదన్నారు. గొడవలకు దిగే రౌడీషీటర్లపై పీడి యాక్ట్ కేసు నమోదు చేయడమే కాక నగర బహిష్కరణ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పేరుకుపోయిన వ్యర్థాలు తొలగింపు

దుగ్గిరాల: రహదారుల వెంట పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలను సర్పంచ్ గంపల గంగాధర్ ఆధ్వర్యంలో తొలగించారు. పేరుకలపూడి గ్రామంలో ఆదివారం వర్షాలతో అపరిశుభ్రంగా పేరుకుపోయిన చెత్తను క్రేన్‌తో తొలగించి రోడ్లను శుభ్రం చేయించారు. చెత్తను బహిరంగంగా వేయవద్దని ఆయన కోరారు.

ఆదిలోనే సమస్యలు.. మళ్లీ పాత రోజులు

- రేషన్ పంపిణీలో మొదలైన కష్టాలు
- సర్వర్ల సమస్యలతో గంటల తరబడి పడిగాపులు
- 10 శాతం కూడా ఇవ్వని వైనం

మంగళగిరి టౌన్, దుగ్గిరాల: లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని కిలో మీటర్ల వ్యవధి మోయలేరని.. వారిని కష్టాల నుంచి గట్టెక్కిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇంటి వద్దకే రేషన్ సౌకర్యానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. ఆదివారం రేషన్ షాపుల వద్దకు రేషన్ తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండుటెండలో రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాశారు. ఇంటివద్దకే రేషన్ అందించే విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేయడంతో ప్రజలు మళ్లీ పాత రోజులను అనుభవిస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గం వ్యాప్తంగా 136 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. ఒక చౌక డిపోలో సగటున 300లకు పైగా కార్డు లబ్ధిదారులు ఉండగా.. ఒక్కొక్క డిపోలో 10 మందికి కూడా రేషన్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దుగ్గిరాలలో తీసుకున్న రేషన్ బియ్యాన్ని కొందరు బైకులు, మరి కొందరు సైకిల్‌పై పెట్టుకుని వెళ్లారు.

తలెత్తిన సాంకేతిక సమస్యలు..

మంగళగిరి పట్టణ పరిధిలోని 8వ నంబర్ చౌక డిపోలో మహిళలు, వృద్ధులు ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి ఉండాల్సి వచ్చింది. డిపోలో 382 మంది లబ్ధిదారులు ఉండగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కనీసం 10 మందికి కూడా రేషన్ అందించలేకపోయారు. 21వ నంబర్ డిపోలో 600 మంది లబ్ధిదారులు ఉండగా ఉదయం చౌక డిపో తెరిచిన దగ్గర నుంచి సర్వర్ పనిచేయని కారణంగా వారంతా వెనక్కి తిరిగి వెళ్లాల్సి వచ్చిందని డీలర్లు చెబుతున్నారు. కొన్ని చౌక డిపోలు ఖాళీగా దర్శనమిచ్చాయి. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు 1 నుంచి 5వ తేదీ లోపు ఇంటి వద్దకు రేషన్ అందజేస్తామని ప్రభుత్వం తెలిపింది. అందుకు తగిన విధి విధానాలు తెలియజేయలేదని.. ఇంటి వద్దకు వెళ్లి మేము ఎలా అందజేస్తామని రేషన్ డీలర్లు వాపోతున్నారు.



సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి నిరీక్షించిన మహిళలు, వృద్ధులు



బైక్‌లపై రేషన్ బియ్యం తీసుకువెళుతున్న లబ్ధిదారులు

పిల్లల్ని బతిమాలుకోవాలి..



నా వయస్సు 85 సంవత్సరాలు. ఈ వయస్సులో నేను బియ్యం బస్తా మోయడం కుదరదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం ఇంటి వద్దకు వచ్చేది. అది చాలా సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు బియ్యం బండి రాకపోవడంతో ఎవరినైనా పిల్లల్ని బతిమాలాల్సి వస్తోంది.

– భూంపల్లి కోటి రెడ్డి, దుగ్గిరాల

చేనేత సమస్యల పోరాటానికి కృషి



షణ్ముఖ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించిన గంజి షణ్ముఖ్‌కు తాడేపల్లి పార్టీ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. ఆదివారం క్రిస్టియన్‌పేటలోని కార్యాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గానికి చెందిన గంజి షణ్ముఖ్‌ను నియమించడం సంతోషకరమన్నారు. అనంతరం షణ్ముఖ్ మాట్లాడుతూ.. చేనేత సమస్యలపై పోరాటం చేస్తానని.. చేనేతల సమస్యలు పరిష్కరించే విధంగా ఉద్యమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బొందాలి సంఘ అధ్యక్షులు బొందిలి నరేంద్రసింగ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరి మేక వెంకటరామిరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరి షేక్ జావిద్, మాజీ కౌన్సిలర్, మైనార్టీ నాయకులు ఎండి గోరేబాబు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గం వాలంటీర్ల విభాగం అధ్యక్షులు సత్య, రాష్ట్ర కార్యదర్శి కొలుసు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా ఉద్యోగ బాధ్యత



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: బాధ్యతాయుతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించితే ప్రజల మన్ననలు పొందవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీవో వెంకటేశ్వరరావు, బేతపూడి పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్‌లకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఉమాశంకర్‌లను పలువురు కార్యదర్శులు, సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఫిరంగిపురం ఈవో ఏకే బాబు. జేఏ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, కార్యదర్శులు బి.మధు, శౌరిజోజి, ఆర్‌డబ్ల్యూఎస్ సాయి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఈత శిక్షణ శిబిరం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సీఐడీ ఎస్పీ చక్రవర్తి

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని అమరావతి రోడ్డులో గల ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల ఈత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి విచ్చేసి మాట్లాడారు. రామేశ్వరంలోని ధనుష్కోటి నుంచి శ్రీలంక వరకు 36 కి.మీ. తాను స్విమ్మింగ్ చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 215 మంది చిన్నారులు ఈతలో శిక్షణ పొందారని అన్నారు. అనంతరం అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన గంధం క్వీనీ విక్టోరియాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్వీనీ విక్టోరియా మాట్లాడుతూ.. ఆక్వా డెవిల్స్ తనకు అందించిన సహకారాన్ని మరువలేనని అన్నారు. శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు పోటీలు నిర్వహించి పలువురు చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులను కె. చక్రవర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విజయకృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వెలగా సురేష్, అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ వెంకట రమేష్, ఉపాధ్యక్షులు జి.సాంబశివరావు, సహాయ కార్యదర్శులు రామిరెడ్డి, జనార్ధనరావు, కోశాధికారి కె.వి.రామయ్య, ఈవెంట్ కన్వీనర్ సీహెచ్ జోజిబాబు, మాజీ అధ్యక్షులు కె.ఎస్ రామచంద్రరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, మందపాటి నరసరాజు, కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లను వెంటనే పునఃనిర్మించాలి

తాడేపల్లి రూరల్: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో నిర్మించిన పేదల ఇళ్లు శిథిలావస్థకు చేరాయని.. వాటిని వెంటనే పునఃనిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద నిర్మించిన ఇళ్లను ఆయన పరిశీలించారు. ఆ ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయని.. ఎమ్మార్పీఎస్ నాయకుల దృష్టికి సమస్య రావడంతో పరిశీలించామని అన్నారు. చాలా మంది ఆ నివాసాలను ఖాళీ చేసి వేరే చోట అద్దెకు నివాసముంటున్నారని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం ఆ ఇళ్లను పరిశీలించి వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాదిగ, వినుకొండ అబ్రహామ్, కుక్కమళ్ల మరియమ్మ, బుల్ల దయామణి, దాసు, బుజ్జి, ఏసుదాసు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

పన్నుల భారాలపై పోరాటానికి సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

మంగళగిరి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న పన్నుల భారాలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం పార్టీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ.. గుంటూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించి భారం మోపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను భారీగా పెంచిందని అన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగలగొడతామని చెప్పిన నారా లోకేష్.. నేడు స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుకూలంగా ఉన్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతోందన్నారు. ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయాలి



హరిబాబు సన్మాన కార్యక్రమంలో ప్రముఖులు

తాడికొండ: అంకిత భావంతో పని చేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తాడికొండ ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ మెహర్ కుమార్, సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు దంపతులు అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో 42 ఏళ్ల కార్యదర్శిగా పనిచేసిన హరిబాబు పదవీ విరమణ సత్కార సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలో ఉద్యోగం అంటే అందరినీ కలుపుకొని పోతూ సేవలందించాలని అన్నారు. విధి నిర్వహణలో హరిబాబు కష్టపడి పనిచేసి అందరి మన్ననలు పొందారని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పలు ప్రభుత్వ విభాగాల సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు వంగా పోలారెడ్డి, మల్లంపాటి రాఘవరెడ్డి, యెడ్డూరి హనుమంతరావు, గుంటుపల్లి మధుసూధనరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగులో రైతులకు మేలు



డ్రోన్ వినియోగాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్తలు

దామరపల్లి(తాడికొండ): అధిక సాంద్రత పత్తి సాగు విధానంలో అధిక దిగుబడులు సాధించ వచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.యుగాంధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల ఎకరానికి 14 వేల మొక్కలను నాటి రెండు కోతలలోనే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎం దీప చిన్నారుల సంరక్షణతో పాటు మహిళల ఉపాధి అవకాశాలు వివరించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ శివ శంకర్ మిరపలో సస్యరక్షణ అంశాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, ప్రభు నగర్ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సీపీఐ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ.. పట్టణాల్లో నివసించే పేదలకు 2 సెంట్లు, గ్రామాల్లో నివసించే పేదలకు 3 సెంట్ల భూమిని ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా పేదల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నామని.. ఆ అర్జీలను ఎంటీఎంసీ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. సోమవారం మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు షేక్ బాషా, రాజు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

పెదకాకాని: ఆయుర్వేద వైద్యం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి అన్నారు. మండలంలోని వెనిగండ్ల రామాలయంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శ్రావణి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు, చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆయుర్వేద పంచకర్మ వైద్యానికి అగతవరప్పాడు సమీపంలో అన్ని సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి స్థాపించామన్నారు. మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, కొండమడుగుల సుబ్బారెడ్డి, మున్నంగి సాంబిరెడ్డి, గుదిబండి సాంబిరెడ్డి, వైద్య బృందం డాక్టర్ భాను కశ్యప్, డాక్టర్ మోనిక, డాక్టర్ రాహుల్ చంద్ర, మేనేజర్ మల్లేశ్వరి, థెరపిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై శిక్షణ

గుంటూరు రూరల్: విపత్తు సమయాల్లో ధైర్య సాహసాలతో ప్రజలను రక్షించే విధంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ తయారవ్వాలని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పదో ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్–1 శిక్షణ తరగతులు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో విపత్తు నిర్వహణపై ప్రత్యేక శిక్షణను అందించారు. క్యాడెట్స్ విపత్తు నిర్వహణ, భద్రతా చర్యలపై అవగాహన పొందారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ సమాజ సేవలో తమదంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసుకోవాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్‌లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావులు శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశిపట్వాల్, క్యాంపు సీనియర్ జేసీఓ ఇమాంసాహెబ్ షేక్, క్యాంపు ట్రైనింగ్ జేసీఓ రాజు, క్యాంపు క్వార్టర్ మాస్టర్ జేసీఓ సూర్యకాంత్, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖరబాబు, కళాశాల ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని.. ఆ హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, సూర్యప్రకాష్, నవనీనతం, శారత, దుర్గాభవాని, ఇమాంబి, జాని, సారమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లైంట్స్ గుంటూరు జిల్లా, మంగళగిరి టౌన్, కరివేపాకు వారి వీధి, డోర్ నెం: 8–157 నివాసి 1) పెండెం వీరాంజనేయులు గారి కుమారుడు పెండెం శివరామకృష్ణ, 2) వీరి భార్య పెండెం కుమారి గార్ల నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... దిగువ షెడ్యూల్ దాఖలా భూమిని సదరు భూమి యజమాని గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నూతక్కి గ్రామ నివాసి (ప్రస్తుత నివాసం మంగళగిరి మండలం, పెదవడ్లపూడి గ్రామం, డోర్ నెం: 2–11/5, ఫ్లాట్ నెం: 103, వెంకటేశ్వర అపార్ట్‌మెంట్స్, నాగార్జున స్కూల్ ఎదురు) శ్యాముల శివారెడ్డి గారి కుమారుడు శ్యాముల నరసారెడ్డి గారు రు. 67,60,000/–లకు నా క్లైంట్స్‌కి విక్రయించుటకు ఖరారుపడి ది. 29–7–2019న నా క్లైంట్స్ పేరున విక్రయ అగ్రిమెంట్ వ్రాసి నా క్లైంట్స్ నుండి విడతలవారీగా రు. 41,00,000/–లు తీసుకొనినాడు. దరిమిలా మిగతా విక్రయ పైకము రు. 26,60,000/–లు తీసుకొని షెడ్యూల్ దాఖలా భూమికి నా క్లైంట్స్ పేరిట రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు వ్రాయించి ఇవ్వకుండా కాలయాపన చేయుచూ, నా క్లైంట్స్‌ను మోసగించు ఉద్దేశ్యంతో షెడ్యూల్ దాఖలా భూమిపై గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, కొప్పురావు కాలనీ, డోర్ నెం: 5–910 నివాసి ఉద్దంటి రామారావు గారి భార్య ఉద్దంటి రాజేశ్వరి గారి పేరిట ఒక మోసపూరిత విక్రయ దస్తావేజు సృష్టించినందున నా క్లైంట్స్ వారిరువురికి లీగల్ నోటీసులు జారీచేసి షెడ్యూల్ దాఖలా భూమికి నా క్లైంట్స్ పేరిట రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు వ్రాయించవలసినదిగా కోరుతూ శ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి, గుంటూరు వారి కోర్టులో ఓ.ఎస్. నెం. 111/2025 గల సూట్ ఫర్ స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ దావాను నా క్లైంట్స్ దాఖలు చేసినారు. సదరు దావాలో నోటీసులు అందిన పిదప షెడ్యూల్ దాఖలా భూమిపై లిటిగేషన్ సృష్టించి నా క్లైంట్స్‌కు నష్టం కలిగించవలెనని దుష్ట తలంపుతో పైన తెలిపిన శ్యాముల నరసారెడ్డి మరియు ఉద్దంటి రాజేశ్వరి గార్లు కుమ్మక్కై షెడ్యూల్ దాఖలా భూమిని మోసపూరితంగా రహస్యంగా ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నములు చేయుచున్నారు. కావున షెడ్యూల్ దాఖలా భూమిపై దావా పెండింగులో ఉన్నందున సదరు శ్యాముల నరసారెడ్డి మరియు ఉద్దంటి రాజేశ్వరి గార్లతో సదరు భూమిపై ఎవరూ ఎటువంటి లావాదేవీలు, క్రయ విక్రయాలు జరుపరాదని, అట్లు జరిపిన లావాదేవీలు క్రయ విక్రయాలు చెల్లనేరవని, అట్లు లావాదేవీలు, క్రయ విక్రయాలు జరిపిన వారు నా క్లైంట్స్ తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ జిల్లా, మంగళగిరి మండలం, పెదవడ్లపూడి గ్రామానికి చెందిన డి.నెం. 320/A-1 లో దిగువ హద్దుల మధ్య గల ఎ. 0–52 సెంట్లు భూమి. తూర్పు: షేక్ చాంద్‌బి గారి భూమి హద్దు: దక్షిణం: చిట్టిబోమ్మ వెంకటేశ్వర్లు గారి భూమి హద్దు: పడమర: అన్నే సంజీవయ్య గారి భూమి హద్దు: ఉత్తరం: సర్కార్ డొంక.

సం/– కొసపం శ్రీనివాసరావు, ఎం.కాం., బి.ఎల్.
1–6–2025 హైకోర్ట్ అడ్వకేట్, మంగళగిరి, గుంటూరు జిల్లా,
మంగళగిరి ఫోన్ నెం: 97018 52089